క్లుప్తంగా

సీతారామపురంలో 104 వైద్య సేవలు



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సుష్మ

గజపతినగరం: మండలంలోని సీతారామపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన 104 వైద్య సేవలో 62మందికి వైద్య సేవలు అందించారు. మరుపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు డి.సుష్మ రోగులను పరీక్షించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ విడుదల



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న ఎంపీడీఓ

దత్తిరాజేరు: నులి పురుగుల నివారణకు ఈ నెల 17 నుంచి మాత్రలు వేయనున్నట్టు దత్తిరాజేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆనంద్‌కుమార్, ఎంపీడీఓ సుబ్రమణ్యం, ఎంఈఓ సుధాకర్ తెలిపారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను వారు శుక్రవారం విడుదల చేశారు. ఈ నెల 17 నుంచి స్కూల్ పిల్లలకు, గర్భిణులకు నులి పురుగుల నివారణ మాత్రలు వేయనున్నట్టు తెలిపారు.

ఎల్.కోట ఎస్‌ఐ నవీన్ పడాల్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐ నవీన్‌పడాల్

లక్కవరపుకోట: స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా నవీన్‌పడాల్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్‌ఐ గోపాలరావు సంతకవిటి ఎస్‌ఐగా బదిలీ కావడంతో ఆయన స్థానంలో విజయనగరం వన్ టౌన్ నుంచి నవీన్‌పడాల్ వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న జియో సభ్యులు

శృంగవరపుకోట: మొక్కలను పెంచడంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్(జియో) వ్యవస్థాపకుడు రామకృష్ణ అన్నారు. పట్టణంలో రోడ్డుకు ఇరువైపులా శుక్రవారం మొక్కలు నాటారు. మొక్కలు పెంచాలనుకుంటున్న ఔత్సాహికులకు పారిజాతం, తబీబియా, వేప, కాగు వంటి మొక్కలు ఉచితంగా ఇస్తామన్నారు. కావాల్సిన వారు 93911 38665 నంబరును సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పాలకుర్తి శరత్ కుమార్, రాంబాబు, సాయికుమార్, హృషికేష, సంతోషి, అప్పలనరసమ్మ పాల్గొన్నారు.

కొనసాగుతున్న స్టాఫ్‌నర్సుల నిరసన



గజపతినగరం ఏరియా ఆస్పత్రి వద్ద స్టాఫ్‌నర్సుల నిరసన

గజపతినగరం: అరకొర జీతాలతో కొన్నేళ్లుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్నామని మమ్మల్ని ప్రభుత్వం గుర్తించడం లేదని స్థానిక ఏరియా ఆస్పత్రి స్టాఫ్‌నర్సులు శుక్రవారం కూడా నిరసన కొనసాగించారు. తమను ప్రభుత్వం గుర్తించడం లేదని, తమ సేవలను వినియోగించుకుంటున్న ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ సేవలను గుర్తించాలని డిమాండ్ చేశారు. నిరసనలో స్టాఫ్‌నర్సులు, జీఎన్ఎంలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దీపారాధన



జామి బజారు సెంటర్‌లో దీపారాధన చేస్తున్న భక్తులు

జామి: మండల కేంద్రమైన జామిలో గురువారం రాత్రి వినాయక నవరాత్రులు ఉత్సవాల్లో భాగంగా భక్తులు భక్తిశ్రద్ధలతో దీపారాధన కార్యక్రమం, ముగ్గులు పోటీలు నిర్వహించారు. జామి బజారు సెంటర్‌లో వినాయక మండపం వద్ద భక్తులు శివలింగం ఆకారంలో దీపాలు వెలిగించి భక్తి భావాన్ని చాటుకున్నారు. స్థానిక గండివీధిలో ముగ్గులు పోటీలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పోటీల్లో పాల్గొన్నారు.

సర్పంచ్‌ల హక్కులను కాలరాస్తున్నారు..

- అధికారులు తీరు మార్చుకోవాలి
- మండల సమావేశంలో సర్పంచ్‌ల ధ్వజం



సమావేశంలో అధికారులను నిలదీస్తున్న సభ్యులు

జామి: రాష్ట్రంలో టీడీపీ హయాంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో సర్పంచ్‌లను డమ్మీలుగా చేస్తున్నారని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ధ్వజమెత్తారు. ఎంపీపీ సబ్బవరపు అరుణ అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో చింతాడ, విజినిగిరి, జన్నివలస, ఏఆర్‌పేట, రామయ్యపాలెం తదితర గ్రామాల సర్పంచ్‌లు మాట్లాడుతూ తమకు అధికారులు కనీసం విలువ ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రతి నెలా పింఛన్ల పంపిణీలో సర్పంచ్‌లను కాకుండా ఎటువంటి పదవుల్లేని టీడీపీ కార్యకర్తలు పింఛన్లు అందజేస్తున్నారని మండిపడ్డారు. ప్రతి సమావేశాల్లో టీడీపీకి చెందిన వారు వేదికలపై కూర్చుంటున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా ఖూనీ చేసారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్‌ల వ్యవస్థలను రద్దు చేసి ఇష్టానుసారంగా పాలన చేసుకోవాలని ధ్వజమెత్తారు. ముఖ్యంగా పంచాయతీ కార్యదర్శులే తమ హక్కులను కాలరాసే విధంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఎంపీడీఓ పూర్తి స్థాయిలో చర్యలు తీసుకొని తమ హక్కులను కాపాడాలని కోరారు. మామిడి పంటకు ఇన్సురెన్స్ పథకం లేదని దాని వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పలువురు సభ్యులు తెలిపారు. మామిడి పంటకు వరి, మొక్కజొన్న మాదిరిగానే ఇన్సురెన్స్ అమలు చేయాలన్నారు. పశువుల షెడ్లు మంజూరులో సర్పంచ్‌లకు సమాచారం అందించడం లేదని వాపోయారు. వెలుగులో పని చేస్తున్న వీఓఏలను తొలగించేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని అదే జరిగితే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. వెలుగు కార్యాలయానికి కొత్తవారు నిత్యం ఎందుకు వస్తున్నారని ఏపీఎంను నిలదీశారు. భీమసింగి సర్పంచ్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ భీమసింగిలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు. తాటిపూడి జలాశయానికి గొర్రెపాటి బుచ్చిఅప్పారావును పేరును కొనసాగించాలని విజినిగిరి సర్పంచ్ సూర్యారావు చేసిన ప్రతిపాదనకు ఏకగ్రీవంగా ఆమోదించారు. చింతాడ సర్పంచ్ ఎ.సుబ్రమణ్యం సూచన మేరకు సీపీఎం సీనియర్ నేత కామ్రేడ్ సీతారాం ఏచూరి మృతికి సభ్యులు, అధికారులు రెండు నిమిషాలు పాటు మౌనం పాటించి సంతాపం తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ గొర్లె సరయు, వైస్ ఎంపీపీలు గేదెల వెంకటరావు, ఎన్నింటి విజయలక్ష్మి, ఎంపీడీఓ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అలుపెరుగని పోరాట యోధుడు ఏచూరి



గజపతినగరం: సీతారాం ఏచూరి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు



లక్కవరపుకోట మండల కేంద్రంలో ఏచూరి చిత్రపటం వద్ద నివాళులు

శృంగవరపుకోట: వామపక్ష నేత, ఉద్యమ వారధి సీతారాం ఏచూరికి సీఐటీయూ అనుబంధ సంఘాల కార్మికులు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. కొత్తూరు గ్రామంలో సీఐటీయూ మండల కార్యదర్శి మద్దిల రమణ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఏచూరి సంతాప సభలో పలువురు మాట్లాడారు. ముందుగా చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఏచూరి మరణం ఉద్యమానికి తీరని లోటు అన్నారు. వామపక్ష ఉద్యమంలో అలుపెరగని పోరాటాలు చేసిన ఎర్ర సూరీడు సీతారాం అన్నారు. ఉన్నత సంప్రదాయ కుటుంబంలో పుట్టిన ఏచూరి పేదల కోసం జీవితమంతా ఉద్యమ బాటలోనే నడిచారన్నారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

ఏచూరి మృతి తీరని లోటు

గజపతినగరం: ప్రజా ఉద్యమ నేత సీతారాం ఏచూరి మృతి వామపక్ష ఉద్యమానికి, స్వచ్ఛమైన రాజకీయాలకు తీరని నష్టమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జి.శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పురిటిపెంట 2 గ్రామ సచివాలయం వద్ద ఏచూరి చిత్రపటం వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి విద్యార్థి నాయకుడిగా అనేక పోరాటాలు నిర్వహించి ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన నాయకుడు ఏచూరి అని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హరికృష్ణ, వేణి, ఎస్.బంగారునాయుడు, వి.లక్ష్మి, గౌరమ్మతో పాటు కృష్ణ, గోవింద, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలసలో..

లక్కవరపుకోట /కొత్తవలస: కమ్యూనిస్టు పార్టీ ఇండియా (మార్కిస్టు) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అకాల మరణం కమ్యూనిస్టులకు తీరని లోటని సీఐటీయూ నాయకులు అన్నారు. కొత్తవలస మండల కేంద్రంలో సీఐటీయూ నాయకులు గాడి అప్పారావు, ఎల్.కోట మండలంలోని తరణి వెంకటరమణ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు, కళాసీల సమక్షంలో ఏచూరి చిత్ర పటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

సైకత చైతన్యం



ధర్మవరం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సైకత శిల్పం

హిందీ దివస్‌ను పురస్కరించుకుని ఎస్.కోట మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జామి వెంకటరమణ రూపొందించిన సైకత శిల్పం విద్యార్థులను ఆకట్టుకుంది. సైకత శిల్పం తయారీలో పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు సహకరించారు. పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు హిందీలో ప్రసంగించి హిందీ ఔన్నత్యాన్ని, ఆవశ్యకతను తెలియజేశారు. హెచ్ఎం బి.ఉమామహేశ్వరరావు నేతృత్వంలో శుక్రవారం నిర్వహించిన జాతీయ హిందీ భాషా దినోత్సవంలో హిందీ ఉపాధ్యాయుడు వి.ఈశ్వరరావును తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. – ఎస్.కోట

పనుల గుర్తింపునకు ప్రత్యేక సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సోమేశ్వరరావు

శృంగవరపుకోట: ఉపాధి పనుల గుర్తింపు కోసం ఇటీవల నిర్వహించిన గ్రామ సభల్లో తమ వారికి ప్రతిపాదనల్లో తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని ఆరోపణలు వినిపించిన నేపథ్యంలో ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఎస్.సోమేశ్వరావు అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీపీ సోమేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో ఎస్.కోటలో ప్రత్యేక పరిస్థితులు ఉన్నాయని, అధికారులు దీన్ని గుర్తించిన పని చేయాలని సూచించారు. నాటి గ్రామసభల్లో తమ ఎంపీటీసీలు ఉపాధి హామీ పనులకు ప్రతిపాదనలు ఇవ్వనందున ఒక్కో ఎంపీటీసీ నుంచి రూ.10లక్షల విలువ చేసే పనులకు ప్రతిపాదనలు తీసుకోవాలని సూచించారు. గ్రామసభల నుంచి వచ్చిన అన్ని ప్రతిపాదనలను జిల్లా పరిషత్‌కు పంపుతామని ఎంపీడీఓ శేషుబాబు చెప్పారు. వైస్ ఎంపీపీ సుబ్బలక్ష్మి మాట్లాడుతూ మండల పరిషత్ ఆమోదించిన తీర్మానం చేసిన పనులను మాత్రమే జిల్లా పరిషత్‌కు పంపాలని సూచించారు.

ముషిడిపల్లి, మూలబొడ్డవర, కిల్తంపాలెం, ధారపర్తి గిరిజన పంచాయతీలు అయినందున అదనంగా నిధులు కేటాయించాలని, మేజర్ పంచాయతీలకు ఆర్‌డబ్ల్యూఎస్‌లో తక్కువ నిధులు కేటాయించారని, గతంలో చేసిన తప్పులు మళ్లీ రిపీట్ కాకుండా చూడాలని ఎంపీపీ చెప్పారు. దీంతో ఎస్.కోట పట్టణ పరిధిలో ఉన్న మహిళా ఎంపీటీసీలు తమ వారికి ఫోన్లు చేసి, వెంటనే ప్రతిపాదనలు పంపాలని చెప్పారు. జెడ్పీటీసీ మమ్ములూరి వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం



కోనూరులో యువత, గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

చీపురుపల్లి రూరల్(గరివిడి): డ్రగ్స్(మాదక ద్రవ్యాల)తో జీవితాలు నాశనం అవుతాయని, యువత మంచి ఆలోచనలతో ముందుకు నడవాలని గరివిడి ఎస్‌ఐ బి.లోకేశ్వరరావు అన్నారు. గరివిడి మండలంలోని కోనూరు గ్రామంలో శుక్రవారం మాదక ద్రవ్యాల నియంత్రణ, సైబర్ క్రైమ్స్, ట్రాఫిక్ రూల్స్, దొంగతనాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మంచి ఆశయాలను లక్ష్యాలుగా ఏర్పర్చుకోవాలని, ఉన్నతమైన భవిష్యత్తును నిర్దేశించాలన్నారు. సమాజానికి ఉపయోగపడే సమాజ సేవా కార్యక్రమాల్లో ముందుండాలన్నారు. డ్రగ్స్ రహిత సమాజ హితం కోసం అందరూ సహకరించాలని కోరారు. అదే విధంగా సైబర్ క్రైమ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, నకిలీ కాల్స్, నకిలీ యాప్స్‌కు స్పందించవద్దని సూచించారు. యువత వాహనాలు నడిపే టప్పుడు ట్రాఫిక్ రూల్స్ అనుసరించాలని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు.

సంతాపం



సూర్యకాంతం(ఫైల్)

వేపాడ: మండలంలోని బొద్దాం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ వల్లంశెట్టి సూర్యకాంతం (75) అనారోగ్యంతో మృతి చెందారు. ఈమె పంచాయతీ సర్పంచ్‌గా 1995 నుంచి 2000 వరకు పని చేశారు. సూర్యకాంతం మృతి పట్ల వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలు తమ సంతాపం తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కారుఢీకొని వ్యక్తికి గాయాలు

గజపతినగరం: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద కారు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. శుక్రవారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గజపతినగరంలోని బూర్లి వీధికి చెందిన చంటి అనే వ్యక్తి తన బండికి ఆయిల్ కొట్టించేందుకు పెట్రోల్ బంక్‌కు టీవీఎస్ వాహనంపై బయలు దేరాడు. అదే సమయంలో కారులో గుంటూరు నుంచి కొరాపుట్ వెళ్తున్న శ్రీనివాస్ అనే వ్యక్తి వెనుక నుంచి టీవీఎస్‌ను ఢీకొట్టాడు. దీంతో రోడ్డుపై పడిన చంటి తలకు బలమైన గాయాలు కావడంతో వెంటనే అదే కారులో గజపతినగరం ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. అప్పటికీ పరిస్థితి విషమంగా ఉండడంతో విజయనగరం మహారాజా ఆస్పత్రికి తరలించినట్లు వైద్యులు తెలిపారు.

అభివృద్ధి పనులకు ఆమోదం

దత్తిరాజేరు: మండలంలో ఉపాధి పథకం ద్వారా జరగనున్న సీసీ రోడ్లు, కాలువలు, పశువుల షెడ్లు తదితర పనులకు ఆమోదం తెలిపినట్టు ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సుబ్రమణ్యం అధ్యక్షతన శుక్రవారం ఈ పనులకు సంబంధించి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీలతో జరిగిన సమావేశంలో గ్రామాల్లో జరగనున్న పనులను గ్రామాల వారీగా చదివి వినిపించారు. అనంతరం వారి ఆమోదం మేరకు ఉన్నతాధికారులకు తీర్మానం పంపినున్నట్టు ఎంపీడీఓ తెలిపారు. జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, పలువురు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పకడ్బందీగా స్కూల్ గేమ్స్ నిర్వహించాలి

గజపతినగరం: మండల స్థాయిలో ఈ నెల 19న నిర్వహించనున్న స్కూల్ గేమ్స్ పోటీలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈఓ విమలమ్మ అన్నారు. ఎంఆర్‌సీ కార్యాలయంలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహణపై మండల కన్వీనర్ చింత సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ క్రీడా పోటీలను ఆహ్లాదకర వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లు సునీత, ధాత్రరాజు, నబీల్, జగన్నాధం, శ్రీనివాస్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల పెద్ద మనసు



సాయం అందజేసి పెద్ద మనసు చాటుకున్న చిన్నారులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని శివరాం ఉన్నత పాఠశాల విద్యార్థులు వరద బాధితులకు సహాయం అందించి పెద్ద మనసు చాటుకున్నారు. విజయవాడలో సంభవించిన వరదల్లో నష్టపోయిన వారికి తమ వంతు సాయంగా 5516 రూపాయలను సాయమందించారు. పాఠశాల విద్యార్థులంతా విరాళాలు సేకరించి వచ్చిన మొత్తాన్ని సీఎం సహాయనిధికి అందజేసి తమకున్న దాతృత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మీసాల శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది, ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన మాజీ ఎంపీ



పూజలు చేసి ఆలయ స్లాబు పనులు ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో నిర్మాణంలో ఉన్న శ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయ స్లాబు పనులను మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప ఆలయ నిర్మాణం దిగ్విజయంగా పూర్తి కావాలని ఆకాంక్షించారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా అయ్యప్ప ఆలయ నిర్మాణాన్ని చేపడుతున్నందుకు ట్రస్టు బోర్డు సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు అప్పికొండ ఆదిబాబు, గంట్యాడ విష్ణు, ఎస్‌విజి.శ్రీనివాసరావు, దాసరి రవి, దిలీప్‌కుమార్ దనూకా తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి స్వచ్ఛత హి సేవ పక్షోత్సవాలు



స్వచ్ఛత హి సేవ పక్షోత్సవాలపై కార్యదర్శులకు ప్రణాళికను వివరిస్తున్న ఎంపీడీఓ

వేపాడ: మండలంలో ఈ నెల 17 నుంచి నిర్వహించనున్న స్వచ్ఛత హి సేవ పక్షోత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ బీఎస్ఎన్ కూర్మనాథ్ పట్నాయక్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. తన కార్యాలయంలో స్వచ్ఛత హి సేవ పక్షోత్సవాలపై కార్యదర్శులతో ఆయన శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్టోబర్ 2 వరకు నిర్వహించే కార్యక్రమాలపై ప్రణాళిక సిద్ధం చేసి పక్కాగా చేయాలన్నారు. ఎంసీఓ రాంబాబు మాట్లాడుతూ ప్రణాళిక అంశాలను పంచాయతీ కార్యదర్శులు వివరించారు. మాస్ పబ్లిక్ ఈవెంట్స్, ర్యాలీలు వర్కుషాప్‌లు, క్విజ్, గ్రామసభలు, స్వచ్ఛత ప్రతిజ్ఞలు తదితర కార్యక్రమాలు అక్టోబర్ 1నాటికి పూర్తి చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

ఉపాధి పనులకు ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక

గజపతినగరం: ఉపాధి హామీ పథకానికి సంబంధించి 3,451 పనులకు ఆమోదం లభించిందని ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉపాధి పనుల తీర్మాన అత్యవసర సమావేశంలో పాల్గొని ఆమె మాట్లాడారు. మండలానికి చెందిన 3 వేల 451 పనులకుగాను విడతల వారీగా రూ.129 కోట్ల 97 లక్షల 97 వేల 550లు నగదు అంచనా వేసి ఆమోదించినట్టు తెలిపారు. విడతల వారీగా నగదు మంజూరు జరిగితే ఆ మేరకు సరిపడ పనులను ఉపాధి అధికారులు వేతనదారులకు పనులు కల్పించనున్నారని పేర్కొన్నారు. వేతనదారులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ కిశోర్‌కుమార్, జెడ్పీటీసీ గార తవుడు, వైస్ ఎంపీపీలు గెద్ద దమయంతి, కర్రి శ్రీదేవి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీ పప్పు సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

మురుగు నిల్వ లేకుండా చర్యలు : డీఎంహెచ్‌ఓ



తాటిపూడిలో కాలువను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

గంట్యాడ: ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. మండలంలోని తాటిపూటిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. కాలువల్లో నిల్వ ఉన్న నీటిని పరిశీలించారు. దోమలు వృద్ధి చెందకుండా ఉండాలంటే నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. ఏసీ మిషన్లు, కూలర్లు, పూల కుండీల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. జ్వర పీడితులు రెండు మూడు రోజులకు మించి ఉంటే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. తరువాత విలేజ్ హెల్త్ క్లినిక్‌ను పరిశీలించారు. రోగులకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. బీసీజీ టీకాలు ప్రతి లబ్ధిదారునికి వేయాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పెదమజ్జి పాలేం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ పల్లవి, సతీష్, హెల్త్ ఎడ్యుకేటర్ సత్తిరాజు, ఎంపీహెచ్‌ఈఓ చంద్రశేఖరరాజు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులంటే అంత చులకనా..!

- మండల సమావేశంలో ఎంపీటీసీల ఆవేదన
- సచివాలయ సిబ్బంది తీరుపై అసంతృప్తి



ఎన్ఆర్ఈజీఎస్ పనుల గుర్తింపుపై సభలో ప్రస్తావిస్తున్న ఎంపీటీసీ కిశోర్

లక్కవరపుకోట: ప్రజల చేత ఎన్నికోబడిన ప్రజాప్రతినిధులకు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో, సంక్షేమ పథకాల అమల్లోను కనీసం గుర్తింపు లేకుండా పోయిందని పలువురు ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిషత్ భవనంలో ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ కె.రూపేష్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అధికారులను ప్రశ్నలతో నిలదీశారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా పనుల గుర్తింపునకు గ్రామ సభలు నిర్వహించారని కనీసం తమకు సమాచారం ఇవ్వలేదని చందులూరు, రేగ ఎంపీటీసీలు యడ్ల కిశోర్, బొడ్డు గణపతి నిలదీశారు. గ్రామాల్లో వెలుగు కార్యాలయం ఆధ్వర్యంలో పని చేసే బుక్ కీపర్లను ఇష్టానుసారంగా తొలగించారని ఇది ఎంత వరకు సమంజసమని సంబంధిత అధికారిని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ ఉద్యోగులు చేతివాటం మొదలుపెట్టారని ఎంపీటీసీ కిశోర్ అన్నారు. సచివాలయాల ద్వారా అందించే సేవలకు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే అధిక మొత్తంలో లబ్ధిదారుల నుంచి వసూళ్లు చేస్తున్నారని మండిపడ్డారు. దీనికి సంబంధించిన సాక్ష్యాలను ఎంపీపీ, ఎంపీడీఓకు చూపించారు. ఈ అక్రమ వసూళ్లపై సమగ్ర విచారణ చేసి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీరాంపురం, ఆర్‌జీపేట సమీపాల్లో గల స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్ తదితర కర్మాగారాల నుంచి కాలుష్యం పెరిగిపోయిందని మూడేళ్లగా ఈ విషయమై సమావేశాల్లో ప్రస్తావిస్తున్నా అధికారులు కనీసం స్పందించడం లేదని తామరాపల్లి సర్పంచ్ ముచ్చు భాస్కరరావు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీఓ రూపేష్ మాట్లాడుతూ సభలో సభ్యులు ప్రస్తావించిన అంశాలపై పూర్తి స్థాయిలో విచారణ చేసి వచ్చే సమావేశానికి సమగ్ర నివేదికలు సభలో పెడతామన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ శ్రీనురాజు, తహసీల్దార్ ప్రసాదరావు, ఈఓపీఆర్‌డీ జ్ఞానేశ్వరరావు, పలువురు అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

'కోట'లో ఫ్లెక్సీల వార్

- ఇరువర్గాల మాటల దాడి
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

శృంగవరపుకోట: పుట్టిన రోజు వేడుకల కోసం పెట్టుకున్న ఫ్లెక్సీల వివాదం పోలీస్‌స్టేషన్ చేరింది. ఇటీవల రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా స్థానిక జనసేన నాయకులు పట్టణంలో దేవీ జంక్షన్‌లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కాగా మాజీ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పుట్టిన రోజు సందర్భంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసేందుకు డిప్యూటీ సీఎం ఫ్లెక్సీలు తొలగించేందుకు గురువారం రాత్రి రఘురాజు వర్గీయులు సిద్ధం అయ్యారు. దీన్ని జనసేన నాయకులు వ్యతిరేకించారు. మరోక చోట ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించటంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. శుక్రవారం రఘురాజు వర్గీయురాలైన ఎస్.కోట సర్పంచ్ సంతోషి కుమారి మీడియా సమావేశం నిర్వహించి జనసేన పార్టీ నాయకుడు ఒబ్బిన సత్యనారాయణ తనతో ఫోన్‌లో అసభ్యంగా మాట్లాడారని, బెదిరించారన్నారు. గతంలో పంచాయతీకి ఆదాయం కోసం ఫ్లెక్సీలు కట్టేవారు నగదు చెల్లించాలని తీర్మానం చేశామని, తాము నగదు చెల్లించి ఫ్లెక్సీలు కడితే, అడ్డుకుని రాద్ధాంతం చేస్తున్నారని తెలిపారు. పవన్‌కళ్యాణ్ వంటి నేతలున్న పార్టీలో ఈ తరహా వ్యక్తులు ఉండటం సిగ్గుచేటని మీడియా సమావేశంలో చెప్పారు. అదే సమయంలో జనసేన ఒబ్బిన సత్యనారాయణ అక్రమంగా డిప్యూటీ సీఎం ఫ్లెక్సీలు తొలగించిన వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ వివాదంపై పట్టణ ప్రజలు పెదవి విరుస్తున్నారు.